# పాపాయి కావాలి

ప్రేమలత తన దేవుని గదిలో సింహాసనాన్ని అలంకరిస్తోంది. పాలవెల్లికి మొక్కజొన్న పొత్తులతోను, సీతాఫలాలతోను అలంకరణ చేసింది. మర్నాడు రాబోయే వినాయక చవితి ప్రత్యేకంగ భక్తితోను, ఆనందంతోను చేస్తోంది ఆమె ఆ అలంకరణ. గౌరీ, శంకరుల గారాల పట్టి బొజ్జగణపతి ఇంటింటి బుజ్జిపాపాయి అయి, పుట్టినరోజు పండుగ చేసుకుంటాడు. పరమాత్ముడై పూజలందుకుంటాడు. ఆ....పూజచేయటంలో ఎంత విచిత్రమైన అనుభూతి! ఈ పాలవెల్లి అలంకరణ చేసే అదృష్టం తనకు ఈ విషయంలో

మాత్రమే! పండుగ రోజున ఈ పాలవెల్లి దైవమందిరానికే అందం, చిన్నారి చిలిపి కళ్ళలో, చిట్టి చిట్టి చేతులతో బోసినవ్వులతో మురిపించే పాపాయి ఉన్న ఇంట ప్రతినిత్యము ఆనందమే!

కానీ....తన జీవితంలో అలాంటి ఆనందానికి నోచుకోలేదు.... ఏమో.... అందుకోసం ఏ నోములు నోచాలో....తనకు తెలిసినంత వరకు తను అన్ని నోములు, పూజలు భక్తి శ్రద్ధలతోనే చేసింది. కాని... అవి ఏవీ...ఫలించలేదు. తనకి మాతృత్వం సిద్ధించలేదు. తన ఇంట పాపాయి ఊయలలు ఊగలేదు. రంగు, రంగుల, రక రకాల బొమ్మలతో తను పాలవెల్లి కట్టి ఊయలలను అలంకరించ లేదు. ఊహ తెలియని తన పసిపాప ఆ పాలవెల్లి ఓ వింత ప్రపం చంలా అడుకొని, కేరింతలు కొడుతుంటే చూసి మురిసిపోయే అదృష్టము లేదు తనకి. అంతే... తనపైన ఆ దేవుని కృపలేదు. అతని కరుణే ఉంటే పండంటి పసిబిడ్డతో తన ఒడి ఎప్పుడో నిండేది. అలా తలచుకునేసరికి అమె మనస్సు భారమై "దేవుడు నిర్దయుడు" అనిపించసాగింది. మరుక్షణంలోనే అమె మనః స్థితి మరో విధంగా పరిణమించింది. 'భగవంతుడు నిర్దయుడు ఎన్నటికి కాదు. అతని లీలలు తెలుసుకొనే శక్తి తనబోటి సామాన్య మానవులకే లేదు. ఆనాడు తను చేసిన పొరపాటుకే ఈనాడు తన గుండెనిండ ఈ వెలితి. రెండేళ్ల క్రితం జరిగిన సంఘటన ప్రేమలత మనసులో కదిలింది.

ఆ....రోజు తను ఇలాగే దైవమందిరాన్ని అలంకరిస్తోంది. తన ప్రియ నెచ్చెలి సుమలత పరుగు పరుగున ఆత్రంగా వచ్చింది. సుమ ఆరాటాన్ని చూసి ఆశ్చర్యపోతూ....కారణం అడిగింది తను.

"ఒక్కసారి మా నర్సింగు హోమ్‌కి వచ్చి చూడవే! నీ....కోసం బంగారు బొమ్మ భగవంతుడిచ్చిన బహుమతిగా ఉందక్కడ, ఆ

పాపాయిని నీ పాపాయిగా చేసుకుంటే నీ....తపన తీరిపోతుంది అంది.

తన మాటలకు ప్రేమలత ఎగిరిగంతులేస్తుంది అనుకున్న సుమలత ఆశను తను నిరాశ చేసింది. "ఈమాట చెప్పటానికటే! ఇంత పరుగున వచ్చేవు. ఇంకా ఏమిటో అనుకున్నాను....అనేసింది. అప్పుడు సుమ ముఖము ఎంత చిన్నబోయిందో!

"అయితే ఏమిటి? నీకు ఆ పాపాయి అక్కర్లేదా? అడిగింది.

సుమలతను అసహ్యించుకుంటూ....బాగుందే సుమా! నీ వరస. ఇలాంటి దిక్కుమాలిన శిశువును నా బిడ్డగా పెంచుకుంటానని నీతో ఎప్పుడైనా అన్నానా?"

తను అలా అనేసరికి మరింత చిన్నపుచ్చుకుని "అదేమిటే.... ప్రేమా! అలా అంటున్నావు. నీ ఎదురుగానే ఎన్నోసార్లు అనలేదు మీ వారు. మీకు ఓ....చక్కని పాపాయిని పెంచుకోవాలని ఉంది. మీ....నర్సింగ్‌హోమ్‌లో చక్కని పాపాయి దొరికే అవకాశము ఉంటే ఎవరైన ఇచ్చేస్తే మేముతప్పక తీసుకుంటాము" అని. అప్పుడు తను ఏమంది.... "చాలు చాల్లేవే! దిక్కు మొక్కులేని పిల్లలను తీసుకొచ్చి పెంచటానికి మా ఇల్లేమీ శరణాలయం కాదు. బావుంది నువ్వు వారి మాటలు పట్టించుకొని ఈ కబురు తెచ్చావన్నమాట" అనేస్తే సుమ వెళ్ళిపోయింది.

ఆ....సాయంత్రం శ్రీవారు ఇంటికి వచ్చాక పెద్ద హడావిడి చేసారు. వారికి ఫోన్‌లో సుమ పాపాయి విషయం చెప్పిందట. ఆఫీసు నుంచి సరాసరి నర్సింగ్‌హోమ్‌కే వెళ్ళి పాపాయిని చూసి వచ్చారట. సుమ తను అన్న మాటలన్నీ వారితో చెప్పిందేమో!

"ఏం....ప్రేమా....మనకి పాపాయి కావాలిగా! సుమతో మరి వద్దన్నావేం?'' నిలదీసి అడిగారు.

తను ఎంతో...కటువుగా అంది, "మనకి భగవంతుడు ప్రసాదిస్తే కడుపు పంట పాపాయి కావాలి గాని....ఎవరో కులం,గోత్రం తెలియని బిడ్డ అక్కర్లేదు".

"అదేమిటి ప్రేమా! అలా అంటున్నావు? పసిబిడ్డకు వాటన్నింటితోను ప్రమేయం ఏముంది? మన ఇంట పెరిగితే మన బిడ్డే అవుతుంది. ప్రేమా! ఆ పాపాయి ఎంతో అందంగా, ఆరోగ్యంగా ఉంది. నాకైతే....వదలిపెట్టి రావాలనిపించలేదు". పాపాయి గురించి చెపుతున్న ఆయన కళ్ళు ఏదో వింతకాంతితో మెరిసాయి. శ్రీవారు అలా అనటంలో నాకు ఎంతగానో బాధించింది.

అయినా తను కూడా పాపాయిని ఒక్కసారి చూసి తీరాలని పట్టుపట్టేరు శ్రీవారు. పాపాయిని చూస్తుంటే....తనకే ముచ్చటగానే అన్పించింది. కాని....తన బిడ్డగా చేసుకోవాలని మాత్రం అనిపించలేదు.

"పాప తల్లిదండ్రులు గురించి తనకు తెలుసునని, తన ప్రక్కయింటిలోనే ఇద్దరూ పనిచేసేవారని, పాప గర్భాన పడగానే అతను చనిపోతే, పాపనుకని ఆమె చనిపోయింది" చెప్పింది సుమలత.

అయినా....తను ఆనాడు ఒప్పుకో లేదు. ఆపాపాయిని పెంచుకోవటానికి! ''పాపాయి కోసం తెగ ముచ్చట పడుతున్నావుగా! రా పాపాయి మనకి అన్నివిధాల బావుంది. తీసుకొని పెంచుకుందాం ప్రేమా...."

మనకొద్దు ఆ తక్కువ జాతి బిడ్డ. ఎంత బాగుంటే మాత్రం మన పాపగా ఎలా అనుకోగలం? అంటూ.... శ్రీవారి మాటలను వారించింది.

"అదేవిటే? ప్రేమా.... నువ్వు అర్ధంచేసుకున్నది ఇంతేనా? ఉన్నతమైన కులంలో పుట్టిన వాళ్లంతా మంచి బుద్ధులతోను, మంచి నడవడికతో పెరుగుతున్నారంటావా? తక్కువ కులంలో పుట్టే వాళ్లంతా చెడుబుద్ధులు, దుష్టప్రవర్తన అలవర్చుకున్నారంటావా? అలా ఎక్కడా ఉండదు. అది మన పెంపకంలో ఉంటుంది. ఇలా ఓ....వారం రోజులు నచ్చచెప్పి, తను విముఖతతో ఉండటంతో ఇక లాభంలేదనుకొని ఊరుకున్నారు శ్రీవారు.

కాని....అతకి మాత్రం అప్పుడప్పుడు ఆ పాపాయి కలలోకి వచ్చేది. పాపాయి కావాలి అని, ఆ.... కలచెదరి మెలకువరాగానే ఒక్క క్షణం అనుకునేది....శ్రీవారి మాటలువిని ఆపాపాయిని పెంచు కుంటే హాయిగా తన మురిపెం తీరి ఉండేదేమో.... అని కాని.... మరుక్షణమే అసహ్యం పుట్టుకొచ్చేది. ఛీ! తన కెందుకు? ఆ....బిడ్డ అని చీదరించుకునేది ఎదుటలేని ఆ పసి బిడ్డను.

కాల ప్రవహాంలో ఏడాది కలిసిపోయిన ఆ....స్మృతి మరపు తెరల మాటకు మరిచిపోలేదు. కళ్ళ ముందు అలా.... అలా....కద లాడుతూనే... ఉంది. సంవత్సరం క్రితం నుంచి శ్రీవారి మాటే విని ఉండవలసింది అన్పిస్తోంది. తనే సంకుచితంగా ఆలోచించింది. విశాల ధృక్పధంతో చూడలేకపోయింది. నిజమే! శ్రీవారు అన్నట్టు ఆ పాపనే తను పెంచివుంటే". తన బిడ్డగా పెరిగేది. తను ఎలా తీర్చిదిద్దితే" ఆ బిడ్డ వ్యక్తిత్వము అలానే....రూపొందేది. ప్చ్! తను

ఏమిటో అప్పట్లో తను ఎంత మూర్ఖంగా ప్రవర్తించింది. ఆ బిడ్డ తనకు భగవత్.... ప్రసాదమేమో.... తను తృణీకరించింది. ఆ పాపనే....తన పాపగా ఎందుకు అంగీకరించలేకపోయింది?

ప్రేమలత కళ్లల్లో కన్నీళ్లు, మనసునిండ తీవ్రమయిన అశాంతి. పెళ్లయిన అయిదేళ్ళకే....తను ఎప్పటికి....తల్లిని కాలేదని తెలుసుకున్న ప్రేమలత అప్పట్లోనే అనుకుంది. 'ఓ..పాపాయిని పెంచుకుని, ఆ....పాపకు తల్లికావాలి' అని.

తనవైపు బంధువులలో, భర్తవైపు వాళ్ల బిడ్డనో పెంపకానికి ఇస్తే బాగుండును అనుకుంది. కాని....వాళ్లందరిలో తనంటే చులకన భావం. అంతా తనను గొడ్రాలని అనేవారు. తన చేతులతో పెరిగితే... వాళ్ళ బిడ్డలు ఏమైపోతారో....అనే భయం ఉన్నవాళ్లు పెంపకానికి ఇవ్వటం మాట అటుంచి, ఆ....పసివాళ్లను తను తాకితేనే వాళ్లకేదో ప్రమాదం ముంచుకొస్తుందని తెగ బెంగపడిపోయేవారు. దానితో ప్రేమలత వాళ్లని అడగడానికి సాహసించలేదు. కానీ.... మొదట నుంచి ప్రేమలత భర్త ప్రభాకర్ మనస్తత్వమే వేరు. 'తమకెలాగు తల్లిదండ్రులయే అవకాశం లేనప్పుడు తల్లి దండ్రుల ఆలన, పాలనకు నోచని ఓ పసిబిడ్డకు తాము తల్లిదండ్రులై ఆ....వెలితి తీర్చగలగాలి' అనుకునేవాడు. అందుకే సుమలత చెప్పిన పాపను తమబిడ్డగా చేసుకుందామని శ్రీమతికి ఎంతగానో.... నచ్చచెప్పి చూసాడు. మారని ఆమె తత్వానికి బాధపడటం తప్ప మరేమీ చేయలేక పోయాడు.

భర్తరాకనే గమనించకుండా కన్నీళ్లతో.... దిగాలుపడి కూర్చున్న ప్రేమలతను చూస్తూనే అలా.... ఉన్నావేం? బాధపడుతున్నావు ఎందుకు? దేనికోసం? నీకేం కావాలి ప్రేమా?"

"మనకి పాపాయి కావాలండి!"

"ఆదేమిటి ప్రేమా? అందుకా? నువ్వు బాధపడుతున్నది. నా.. పిచ్చి ప్రేమా! ఇక ఆ... విషయం వదిలేయ్! మనకి భగవంతుడు ఆ... అదృష్టం ఇవ్వలేదు.

"లేదండీ! భగవంతుడు ఇచ్చినా.... నేనే ఆ అదృష్టాన్ని కాలదన్నాను. ఆనాడే.... మనం సుమ చెప్పిన ఆ....పాపాయిని పెంచుకొని ఉంటే ఈ పాటికి తప్పటడుగులతో మన ఇంట తిరుగాడేది. ముద్దు ముద్దు మాటలతో మనలను మురిపించేది."

భార్య మాటలకు ఆనందాశ్చర్యాలతో తలమునకలయ్యేడు ప్రభాకర్. భార్యను దగ్గరకు తీసుకుంటూ.... "ఆనాడు ఏవో ఊహించుకొని ఆ....పాపాయిని వదిలేసినందుకు ఇంత బాధపడుతున్నావా? ప్రేమా! ఇలా... అయితే ఇప్పుడు మనలని అమ్మ, నాన్నలని చేయటానికి సిద్ధంగా ఉంది ఓ...చిన్నారి. నిన్ననే సుమ నాతో చెప్పింది. ఎలాయిన నీకు నచ్చచెప్పి ఈ పాపాయినైన పెంచుకొమ్మని. కానీ....నేనే ఊరుకున్నాను. ఇలా మాటిమాటికి నిన్ను కలవరపెట్టటం ఇష్టంలేక, నిజంగా చెప్పు ప్రేమా... ఆ పాపాయిని అయినా మనం పెంచుకుందాం.

"అలాగే నండీ! ఇప్పుడే మనం సుమ దగ్గరకు వెళ్ళి పాపాయిని చూద్దాం" అలా అంటున్న ప్రేమలత ముఖంలో సంతోషం చోటు చేసుకుంది.

ప్రభాకరం దంపతులని చూడగానే డాక్టర్ సుమలత ఆశ్చర్యపోయింది. "ఇలా వచ్చారేంటీ....ప్రేమా!"

"పాపాయి ఉండటగ! దానిని తీసుకు వెళ్లటానికి వచ్చాము".

'ఇదేమిటే తల్లి! నాతో వేళాకోళమా? నీకు?'

'అబ్బే అదేంకాదు సుమా! నీతో నాకు వేళాకోళమేమిటి? నిజంగా అంటున్నా."

"అయితే రండిమరి. పాపను చూదురుగాని" ఇద్దరూ....సుమలతను అనుసరించారు.

"పాపాయిని చూడగానే ప్రేమలత ప్రేమగ చేతుల్లోకి తీసుకుంది. గుండెకు హత్తుకొని "నా....వరాల పంటవే! నన్ను అమ్మను చేసిన మురిపాల మూటవే! అంటూ ముద్దుల వర్షం కురిపించింది.

"సారీ" ప్రేమా.... అంత తొందరపడకు. ఈ పాప తల్లిదండ్రుల గురించి నాకు అసలు ఏమీ తెలియదు. వంటరిగానే ప్రసవానికి ఇక్కడికి వచ్చిన ఆమె, పుట్టిన పసికందును ఇలా.... వదలి వెళ్ళిపోయింది. నిన్న మీవారు కనిపిస్తే ఏదో మాటగా అన్నాను అంతే! మీరు పెంచేసుకోవాలని కాదు".

"ప్లీజ్ సుమా! అలా మాట్లాడకే! అప్పటిలా అర్ధంలేని నమ్మకాలతో బూజుపట్టిన భావాలతో ఈ... పుత్తడిబొమ్మను దూరం చేసుకోను. నాకు ఈ.... పాపాయి కావాలి." ధృడంగా అంటూ పాపని మరింతగా గుండెలకు హత్తుకుంది ప్రేమలత.

ప్రేమని అలా....పసిబిడ్డతో చూస్తుంటే....ప్రభాకర్ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

ప్రేమలత లోని ఈ మార్పుకు ఎంతో సంతోషించింది సుమలత.